సాక్షి ప్రకాశం

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



విద్యాభివృద్ధికి అంగలకుర్తి సేవలు చిరస్మరణీయం

విద్యాభివృద్ధికి అంగలకుర్తి సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు.

- 8లో..



మహిళా పోలీసుల సమాచారానికి ప్రాధాన్యం

మహిళా పోలీసులు ఇచ్చిన సమాచారంపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
32 /20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

నేడు అంగలకుర్తి సాహిత్య సమాలోచన

ఒంగోలు టౌన్: రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ప్రముఖ కవి, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ అంగలకుర్తి విద్యాసాగర్ సాహిత్యంపై ఎన్టీఆర్ కళాపరిషత్‌లో గురువారం సాయంత్ర సాహిత్య సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఏ.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగలకుర్తి విద్యాసాగర్ సాహిత్యాన్ని డాక్టర్ అంగలకుర్తి క్షామరేడు, పొన్నూరి శ్రీనివాసులు సమీక్షిస్తారన్నారు. అంగలకుర్తి రచించిన పాటల పుస్తకాన్ని గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ ఆవిష్కరిస్తారని, సాహిత్యాభిమానులు, కళాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్దుబాటు జాబితా ఇవ్వాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్దుబాటు జాబితా విడుదల చేయాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి తదితరులు జిల్లా విద్యాశాఖ అధికారిని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నెలరోజుల నుంచి మిగులుగా తేలిన ఎయిడెడ్ ఉపాధ్యాయులను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలలకు శాశ్విత ప్రాతిపదికన సర్దుబాటు చేయాలని ప్రొసీడింగ్స్ ఇచ్చారన్నారు. బాపట్ల డీఈవో గత నెల 6వ తేదీ మిగులు ఉపాధ్యాయుల జాబితాను ప్రకాశం జిల్లా డీఈవోకు పంపారని, కానీ ప్రకాశం జిల్లా డీఈవో కార్యాలయంలో మాత్రం నేటికీ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో చాలా పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయునితో బోధన జరుగుతుందని, కనుక జిల్లా విద్యాశాఖ అధికారి తక్షణమే స్పందించి మిగులుగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కోరారు.

ఏపీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఒంగోలు: ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక ఆపస్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. మార్చి 5, 6 తేదీల్లో నెల్లూరులోని వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను చర్చించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యా విధానం, అమలులో చేయాల్సిన మార్పులు, చేర్పులపై చర్చిస్తామన్నారు.

1998 డీఎస్సీ అభ్యర్థుల సమస్యకు క్యాబినెట్ ఆమోదంపై హర్షం

ఒంగోలు: 1998 డీఎస్సీ అభ్యర్థుల సమస్యకు క్యాబినెట్ ఆమోద ముద్ర పడడంపై 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వీరయ్య, మండువ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వ ప్రతిపాదనకు ఆమోద ముద్రం పడడం ద్వారా ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని ప్రదర్శించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4534 మందికి ఉద్యోగాలు రానున్నాయని, 24 సంవత్సరాలుగా తాము చేసిన సుదీర్ఘ పోరాటానికి స్ఫూర్తిదాయకమైన అర్థాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యన్నారాయణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్‌తోపాటు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్, జాక్టో అధ్యక్షుడు కె.జాలిరెడ్డిలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశం జరగాలి

కొత్తపట్నం: ఉగాది నాటికి గృహాలు పూర్తి చేసి నూరు శాతం గృహ ప్రవేశం చేయాలని విజయవాడ నుంచి వచ్చిన గృహ నిర్మాణ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ జయరామచారి లబ్ధిదారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపట్నం జగనన్న లేఅవుట్లను తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు ఎందుకు ఆగాయి, ఎందుకు బేస్‌మట్టం వేయలేదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రూపులో ఎంత మంది ఉన్నారు, ఎంత మంది లోన్లు తీసుకున్నారు, లోను ఎందుకు తీసుకోలేదో ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది నాటికి గృహాలు పూర్తి చేసి గృహ ప్రవేశం చేయాలన్నారు. అసలు బేస్‌మట్టం వేయని వారు ఉంటే నగదు లేకపోతే వెలుగు నుంచి సీఐఎఫ్ నుంచి నగదు తీసుకోవచ్చన్నారు. శ్లాబ్, రూఫ్ లెవల్ వరకు అయిన వాటిని ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ వేణుగోపాల్, డీఈ వెంకటనారాయణరెడ్డి, ఎంపీడీవో పి.సుజాత, ఏపీఎం రజీయా సుల్తాన్ బేగం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన కొత్తపట్నం రోడ్డుకు మహర్దశ పట్టనుంది. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి చొరవతో మధ్యలోనే నిలిచిపోయిన బకింగ్‌హాం కెనాల్ వంతెన పనులు పూర్తి కావచ్చాయి. అలాగే రయ్.. రయ్ మంటూ హాయిగా బీచ్‌కు వెళ్లేందుకు వీలుగా రూ.29 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టనున్నారు.



చురుగ్గా సాగుతున్న బకింగ్‌హాం వంతెన నిర్మాణ పనులు

హాయిగా.. సాఫీగా..

కొత్తపట్నం రోడ్డుకు మహర్దశ

- బకింగ్‌హాం కెనాల్ నుంచి పల్లెపాలెం వరకు రూ.29 లక్షలతో రోడ్డు మరమ్మతులు
- త్వరలో టెండర్లు.. ఆ వెంటనే పనులు ప్రారంభం
- పూర్తి కావస్తున్న బకింగ్‌హాం కెనాల్ వంతెన నిర్మాణం
- టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే దామచర్ల నిర్వాకంతోనే పనులు జాప్యం
- రద్దయిన కేంద్ర ప్రభుత్వ ఎన్‌సీఆర్‌ఎంపీ స్కీం
- బాలినేని చొరవతో జోరుగా వంతెన పనులు



ఇటీవల బకింగ్‌హాం కెనాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సువిశాల సముద్ర తీరమున్న జిల్లాలో రెండు ప్రధాన బీచ్‌లు ఉన్నాయి. ఒకటి కొత్తపట్నం, రెండోది సింగరాయకొండ మండలం పాకల బీచ్. సెలవులొస్తే ఇవి ప్రజలకు విహార కేంద్రాలు. అయితే జిల్లా కేంద్రానికి 18 కిలోమీటర్ల దూరం ఉన్న కొత్తపట్నం సముద్రతీరానికి వెళ్లేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. పర్యాటకంగా ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చే ఈ బీచ్ రోడ్డును గత పాలకులు విస్మరించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోడ్డుపై వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో మధ్యలో వదిలేసిన ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులోని బకింగ్‌హాం కెనాల్ వంతెన నిర్మాణ పనులపై ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పనులు చేపట్టే విషయంలో కాంట్రాక్టర్‌ను ఉరుకులు పరుగులు తీయించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రప్పించేందుకు కృషి చేశారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత దామచర్ల జనార్దన్ బకింగ్‌హాం కెనాల్ వంతెనకు శ్లాబు కాదుకదా వంతెనకు సైడ్ గడ్డర్లు కూడా వేయించలేకపోయారు. ఆగిపోయిన పనుల్లో వేగం పెంచేలా చర్యలు చేపట్టారు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని. వంతెనకు సైడ్ గడ్డర్లు వేయటంతో పాటు సింగిల్ స్పాన్ వంతెనకు స్లాబు వేయటం మొదలుకొని అప్రోచ్ రోడ్లు, వంతెనపై ఫినిషింగ్, అప్రోచ్ రోడ్లులకు రివిట్‌మెంట్‌లాంటి నిర్మాణ పనులను బాలినేని పర్యవేక్షణలో పూర్తి కావస్తున్నాయి. బాలినేని తనయుడు, యువనేత ప్రణీత్ రెడ్డి కూడా బకింగ్‌హాం కెనాల్ వంతెన నిర్మాణ పనులు విషయంలో ఎప్పటికప్పుడు ఆర్‌అండ్‌బీ అధికారులను సమన్వయం చేసుకొని పనులు పూర్తి కావటానికి తన వంతు సహకారాన్ని అందించారు.

రూ.29 లక్షలు మంజూరు:

ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులోని బకింగ్‌హామ్ కెనాల్ నుంచి బీచ్ వరకు రోడ్డు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.29 లక్షలు మంజూరు చేసింది. బీచ్‌కు వెళ్లే పర్యాటకులు, కొత్తపట్నం మండలంలోని ప్రజలకు ఇబ్బంది లేకుండా చేసేందుకు బాలినేని ప్రత్యేక చొరవ చూపారు. రోడ్డును మరమ్మతులు చేయటానికి ఈ నిధులు మంజూరు చేయించారు. దాదాపు 5 కిలో మీటర్ల మేర రోడ్డును మరమ్మతులు చేయటంతో పాటు రోడ్డు మార్జిన్లను కూడా అభివృద్ధి చేయనున్నారు. టెండర్లు పిలిచేందుకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. టెండర్లు ఖరారైన వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

రోడ్డు మరమ్మతులకు టెండర్లు పిలుస్తున్నాం



కొత్తపట్నం రోడ్డు మరమ్మతులకు టెండర్లు పిలుస్తున్నాం. బకింగ్‌హాం కెనాల్ నుంచి సముద్రం ఒడ్డున బీచ్ వరకు పనులు చేపట్టనున్నాం. అందుకోసం ప్రభుత్వం రూ.29 లక్షలు మంజూరు చేసింది. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి చొరవతో రోడ్డు మరమ్మతులు చేపట్టి పర్యాటకులకు, స్థానికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొత్తపట్నం సముద్రతీరానికి సాఫీగా వెళ్లేందుకు రోడ్డును సిద్ధం చేస్తాం.

– కే.విజయరత్నం,
ఎస్ఈ, ఆర్అండ్‌బీ శాఖ

టీడీపీ నేతల నిర్వాకంతో రద్దయిన కేంద్ర ప్రభుత్వ స్కీం...

టీడీపీ ప్రభుత్వం హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో బకింగ్‌హాం కెనాల్ వంతెన నిర్మాణ పనులకు 2015వ సంవత్సరంలో నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తరువాత 2016 ఆగస్టు 31న కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకున్నాడు. అయితే 2018 ఆఖరుకు నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే టీడీపీ పాలకుల నిర్వాకం, అప్పటి టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కమీషన్ల కోసం సకాలంలో వంతెన నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఆ పథకం రద్దయిందన్న ఆరోపణలున్నాయి. దీంతో కాంట్రాక్టర్ పనులు చేయకుండా చేతులెత్తేశాడు. బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు
- సభ్యులతో కలిసి అటవీ ప్రాంతంలోని పెద్దచేమ గూడెంలో రాత్రి బస
- వన్యప్రాణులు సంచరించే చోట చెట్టుపైన మంచెపై నిద్ర
- చెంచు గిరిజనుల జీవనశైలిని అడిగి మరీ తెలుసుకున్న కమిషన్ చైర్మన్
- గిరిజన స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులు



స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు

పెద్దదోర్నాల: చెంచు గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని లోతట్టు అటవీ ప్రాంతం పెద్దచేమ గూడేన్ని ఆయన మంగళవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా గూడెంలోని పలు గిరిజన కుటుంబాలను ఆయన సందర్శించి వారి జీవన స్థితిగతులను పరిశీలించారు. గూడెంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సరైన సదుపాయాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతుంటే సమాధానం చెప్పాల్సిన అధికారులు ఏరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడి నుండో ఎస్టీ కమిషన్ వస్తుంటే ఇక్కడ ఉండాల్సిన అధికారులు ఏమయ్యారంటూ ఆయన అధికారుల తీరుపై మండి పడ్డారు. సమావేశానికి రాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి చెంచు గిరిజనులకు అందాల్సిన అభివృద్ధి ఫలాలపై సమీక్ష నిర్వహించారు.

గిరిజనులు అటవీ సంపదను కాపాడే అడవి తల్లి ముద్దుబిడ్డలు:

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో చెంచు గిరిజనులను ఉద్దేశించి కుంభా రవిబాబు మాట్లాడుతూ ఆదివాసీలు అనాదిగా అటవీ సంపదను కాపాడే అడవి తల్లి ముద్దుబిడ్డలని కొనియాడారు. వనాలను, వన్యప్రాణులను అనునిత్యం కాపాడుతూ అటవీ సంరక్షణకు నిరంతరం పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. చెంచు గిరిజనుల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని చెప్పారు. ఆరోగ్యం, విద్య పట్ల ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే చెంచు గిరిజనులకు అటవీశాఖ అధికారుల తీరుతో కొంత మేర ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. 2008 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అటవీహక్కుల చట్టం ఏర్పాటు చేసి గిరిజనులు సాగు చేసుకునే భూములపై వారికే హక్కు కల్పించారని అన్నారు. అదే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనతి కాలంలోనే 4 లక్షల 26 వేల ఎకరాల భూమిని పంపిణీ చేశారని ఆయన కొనియాడారు. ఇంకా ఎన్నో అప్లికేషన్లు వస్తున్నాయని పేర్కొన్నారు. భారతదేశంలో ఇంత వరకు ఏ ముఖ్యమంత్రి ఇన్ని ఎకరాల భూమిని పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని ప్రకాశం, పల్నాడు, నంద్యాల జిల్లాల్లో ఎన్నో వేల మంది చెంచు రైతులకు అటవీ భూమిని పంపిణీ చేశారని చెప్పారు. ఈ సందర్భంగా గూడెలంలోని బేస్ క్యాంపు వద్ద ఏర్పాటు చేసిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దట్టమైన అటవీ ప్రాంతంలో చెట్టుపై ఏర్పాటు చేసిన మంచెపై ఆయన రాత్రి నిద్రించారు. ఈ సందర్భంగా చెంచు గిరిజనులు అందించిన రాగి సంగటి, రాగి జావలను రుచిచూసి గిరిజన మహిళలను అభినందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి, డీటీడబ్ల్యూ జగన్నాథరావు, ఎస్టీ కమిషన్ సభ్యులు వడితె శంకర్‌నాయక్, జంపరంగ లిల్లీ, మురళి, రామలక్ష్మీలతో పాటు డీఎల్‌డీఓ. సాయికుమార్, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ డీఈ ప్రకాశరావు, ఐటీడీఏ డీఈ లతా, డిప్యూటీ డీఎంహెచ్ఓ. శ్రీనివాసరావు, సీడీపీఓ అరుణ, సీఐ మారుతీ కృష్ణ, ఎస్సై శ్రీనివాసరావు, పారెస్టు రేంజి అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మంచెపై గుడిసెలో నిద్రించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు, సభ్యులు, ప్రాజెక్టు అధికారి

సచివాలయ సిబ్బంది

బాధ్యతగా పని చేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్ కుమార్

సీఎస్‌పురం: సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని అరివేముల గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారు చేస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో ఎన్ని గృహాలు ఉన్నాయి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎంత మంది ఉన్నారు, సకాలంలో సేవలు అందిస్తున్నారా లేదా అనే దాని గురించి చర్చించారు. భూములు రీసర్వే నూరు శాతం త్వరిత గతిన పూర్తి చేయాలని వీఆర్వో, సర్వేయర్లను ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని మహిళా పోలీసుకు సూచించారు. సచివాలయ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్‌కుమార్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఎంఈఓ జె ప్రసాదరావు, తదితరులు ఉన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే జంక్షన్‌ను ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయాలి

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా సీఎస్‌పురం వద్ద ఏర్పాటు చేయనున్న జంక్షన్‌ను ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసేలా ఆదేశించాలని సీఎస్‌పురానికి చెందిన రైతులు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కోరారు. పలువురు రైతులు బుధవారం అరివేములలో కలెక్టర్ దినేష్ కుమార్ ను కలిశారు. సీఎస్‌పురం రెవెన్యూలో 138, 139, 140 తదితర 33 సర్వే నంబర్లలో ఉన్న తమకు సంబంధించిన 39 ఎకరాల సెటిల్మెంట్ భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు జంక్షన్ కోసం కావాలంటున్నారనీ, ఆ భూములకు పక్కనే 147/1 లో 513 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆ ప్రభుత్వ భూమిలో జంక్షన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే డీజీపేట రెవెన్యూలో 56 సర్వే నంబర్‌లో ఉన్న తమ భూములను వేరే వారి పేరుతో ఆన్‌లైన్ చేశారనీ తమ భూములను తమకు ఇప్పించి న్యాయం చేయాలని డీజీపేట కు చెందిన పలువురు ముస్లింలు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, ఆర్డీఓ సందీప్‌కుమార్, డీటీ మాధవరావు తదితరులు ఉన్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అర్జీ అందజేస్తున్న సీఎస్‌పురం రైతులు

ఏసీబీ వలలో కానిస్టేబుల్, ఎస్ఐ

- కొండపి స్టేషన్‌పై ఏసీబీ అధికారుల దాడులు
- లంచం తీసుకుంటూ పట్టుబడిన కానిస్టేబుల్, ఎస్ఐ



లంచం తీసుకుంటూ పట్టుబడి రోదిస్తున్న ఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ కోటేశ్వరరావు

కొండపి: కొండపి స్టేషన్‌పై ఏసీబీ అధికారులు దాడులు చేసి రూ.20 వేలు లంచం తీసుకుంటున్న కానిస్టేబుల్, ఎస్ఐలను పట్టుకున్న సంఘటన బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో జరిగింది. గుంటూరు ఏసీబీ డీఎస్పీ టీవీవీ ప్రతాప్ కుమార్ తెలిపిన సమాచారం మేరకు మండలంలోని కట్టావారిపాలెం గ్రామానికి చెందిన అంగలకుర్తి వెంకటేశ్వర్లు కుటుంబంలో అన్న తమ్ముళ్లకు, తండ్రికి తగాదాలు ఉన్నాయి. ఈవిషయమై వెంకటేశ్వర్లును ఎస్ఐ కె.రామకృష్ణ స్టేషన్‌కి పిలిపించి విచారించారు. ఈక్రమంలో కట్టావారిపాలెం గ్రామానికి చెందిన ఏ సుజాత గత నెల 31వ తేదీ అంగలకుర్తి వెంకటేశ్వర్లు మీద ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అదే విధంగా కొండపి గ్రామానికి చెందిన వై మల్లిఖార్జునరావు కూడా వెంకటేశ్వర్లు మీద ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడుతూ ఫిర్యాదు స్టేషన్‌కి పోస్టు చేశాడు. కాగా సుజాత కేసులో బెయిల్ ఇవ్వటానికి, ఎస్సీ ఎస్టీ కేసు విషయంలో రాజీ చేయటానికి ఎస్ఐ రామకృష్ణ.. వెంకటేశ్వర్లును లంచం డిమాండ్ చేశాడు. దీంతో అతను ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు బుధవారం 6 గంటల సమయంలో స్టేషన్‌కి వెళ్లిన వెంకటేశ్వర్లు.. ఎస్ఐ రామకృష్ణ సూచనల మేరకు కానిస్టేబుల్ గోగుల కోటేశ్వరరావుకు రూ.20 వేలు లంచం ఇస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు పని చేయటానికి ప్రజలను లంచం అడిగితే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 14400 స్పందన యాప్‌కి లిఖిత పూర్వకంగా లేక మౌఖికంగా డాక్యుమెంటరీ వీడియోలు ఉన్నా పెట్టి ఏసీబీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ దాడుల్లో సీఐలు పీవీవీ శ్రీనివాసరావు, శేషు, అపర్ణతో పాటు ఇద్దరు గుంటూరు సీఐలు, ఎస్ఐలు ప్రసాదు, షరీఫ్ పాల్గొన్నారు. కొండపి పోలీస్‌స్టేషన్ మీద తొలిసారి ఏసీబీ అధికారులు దాడులు చేసి లంచం తీసుకుంటున్న ఎస్ఐ, కానిస్టేబుల్‌ని పట్టుకోవటం పట్టణంలో సంచలనంగా మారింది.

11న హెచ్‌ఎం అకౌంట్ టెస్టు

ఒంగోలు: ఈనెల 11, 12 తేదీల్లో హెచ్‌ఎం అకౌంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.విజయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విజయవాడ వన్‌టౌన్ పరిధిలోని గాంధీజీ మున్సిపల్ ఉన్నతపాఠశాల, వైఎస్సార్ కడప జిల్లా మద్రాసురోడ్డులోని మయూరి బేకరీ ఎదురుగా ఉన్న ఉర్దూ బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్ల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

బాలికపై లైంగిక దాడి

ముండ్లమూరు: మండలంలోని బొప్పూడివారి పాలెంలో నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై గ్రామానికి చెందిన హోటల్ నిర్వాహకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన బాలిక నాల్గవ తరగతి చదువుతుంది. ఈ నెల 4వ తేదీన టిఫిన్ కోసం గ్రామంలోని గోవిందయ్య టిఫిన్‌సెంటర్‌కు వెళ్లగా చిన్నారిని లోపలికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి కేకలు వేయడంతో వదిలేశాడు. చిన్నారి తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

హత్య కేసులో భార్యకు యావజ్జీవ జైలుశిక్ష

మార్కాపురం: భర్తను చంపిన హత్య కేసులో నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మార్కాపురం ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తి రాజవెంకటాద్రి బుధవారం తీర్పు చెప్పినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల క్రిష్టారావు తెలిపారు. మార్కాపురం పట్టణానికి చెందిన ఖాదర్‌బాషాకు దర్శికి చెందిన మస్తాన్ బీతో వివాహమైంది. వారు దర్శిలో నివాసం ఉంటూ జీవిస్తున్నారు. అయితే 2016 డిసెంబర్ 21న ఖాదర్‌బాషాని మస్తాన్‌బీ హత్య చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. భార్య భర్తల మధ్య విబేధాలే కారణమని తెలిపారు. కేసులో నేరం రుజువు కావడంతో మస్తాన్‌బీకి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు క్రిష్టారావు పేర్కొన్నారు.

ఆటో- ఆర్టీసీ బస్సు ఢీ



మృతిచెందిన రైతు, డ్రైవర్

అద్దంకి: ఆర్టీసీ బస్సు, ఫోర్ వీలర్ ఆటో ఎదురెదురుగా ఢీ కొట్టుకున్న ఘటనలో ఆటో డ్రైవరుతో పాటు అందులో ప్రయాణిస్తున్న రైతు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన బాపట్ల జిల్లాలోని సంతమాగులూరు మండలంలోని పాతమాగులూరు గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం మల్లవరం గ్రామానికి చెందిన డి. వెంకటేశ్వరరెడ్డి, అదే గ్రామానికి చెందిన కె. వెంకటేశ్వరరెడ్డి ఆటోలో మిరపకాయలను లోడ్ చేసుకుని గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లారు. అక్కడ వాటిని అమ్ముకుని, తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో ఆటో మండలంలోని పాతమాగులూరు గ్రామ సమీపంలోకి రాగానే, గుంతకల్లుకు చెందిన ఆర్టీసీ బస్సు, ఫోర్‌వీల్ ఆటో ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. దీంతో ఆర్టీసీ బస్సు కింద ఆటో జొరబడి ముందు భాగం ఇంజన్‌తో సహా నుజ్జునుజ్జయింది. దీంతో ఇద్దరూ మరణించారు. సంతమాగులూరు ఎస్సై నాగశివారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



నుజ్జునుజ్జయిన ఆటో

విద్యాభివృద్ధికి 'అంగలకుర్తి' సేవలు చిరస్మరణీయం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



పొదుపు గ్రూపు మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

సీఎస్‌పురం: విద్యాభివృద్ధికి ఆనందం అయ్యవారు, నవమణి అయ్యవారమ్మ దంపతుల సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పేర్కొన్నారు. రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అంగలకుర్తి విద్యాసాగర్ తల్లిదండ్రులు అంగలకుర్తి ఆనందం అయ్యవారు, నవమణి అయ్యవారమ్మ 20వ సంస్మరణ సభ మండలంలోని అరివేముల గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య ప్రాముఖ్యత తెలియని రోజుల్లో మారుమూల ప్రాంతమైన అరివేములలో పాఠశాల ఏర్పాటు చేసి, పరిసర గ్రామాల ప్రజలకు విద్యా బుద్ధులు నేర్పించి వారి ఉన్నతికి దోహదపడ్డారని కొనియాడారు. ఆ దంపతుల సంతానం సైతం ఉన్నత పదవులు చేపట్టడంతోపాటు ఐఏఎస్ అధికారిగా ఉన్న అంగలకుర్తి విద్యాసాగర్ పుట్టిన గడ్డకు మేలు చేయాలనే తలంపుతో గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషి చేయడం, చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యాభివృద్ధికి పాటుపడటం అభినందనీయమన్నారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మూడు పొదుపు గ్రూపులకు స్త్రీనిధి కింద రూ.45 లక్షల నిధులను ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు బాల్య వివాహాలను నియంత్రించేందుకు దోహదం చేస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. పేదరికం కారణంగానే బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు. చిన్న వయసులో వివాహం చేసుకున్న ప్రతి ఐదుగురిలో ఇద్దరు మృతి చెందుతున్నారన్నారు. బాల్య వివాహాల్లో అనంతపురం ప్రథమ స్థానంలో ఉండగా ప్రకాశం జిల్లా రెండో స్థానంలో ఉందని, దీన్ని నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మహిళలు విద్యావంతులైతే దేశం పురోగతి సాధిస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దీనిపై దృష్టి పెట్టి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడం ద్వారా మహిళల చదువుకునేందుకు దోహదం చేస్తున్నారన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లో సైతం వెల్ఫేర్ హాస్టళ్లు, కళాశాలలు ఏర్పాటు ద్వారా బాలికల డ్రాపౌట్స్ తగ్గాయన్నారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి లో జిల్లాలో 11,475 మంది బాలికలు ఉత్తీర్ణత కాగా వారిలో 11 వేల మందిని కళాశాలలో చేర్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై ప్రాథమిక పాఠశాల చిన్నారులు ప్రదర్శించిన నాటకం ఆహూతులను ఆకట్టుకుంది.

సమస్యలపై వినతులు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు రహదారిని అభివృద్ధి చేయాలని, శ్మశానవాటికకు రోడ్డు వేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ సన్నపురెడ్డి రాధా రుక్మిణమ్మ కలెక్టర్‌ను కోరగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్ధంతరంగా నిలిచిన ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ భవనాన్ని పంచాయతీ నిధులతో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్‌కుమార్, మెప్మా పీడీ టి.రవికుమార్, ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, ఎంఈఓ జె.ప్రసాదరావు, సర్పంచ్ సన్నపురెడ్డి రాధారుక్మిణమ్మ, నారాయణస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ కత్తి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సరైన సాక్ష్యాలతో దోషులకు శిక్ష

- అందుకు తగిన సాక్ష్యాధారాలను కోర్టుకు ఇవ్వాలి
- తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ ఆర్.తిరుపతి
- పెద్దదోర్నాలలో అటవీ శాఖాధికారులకు రెండు రోజుల శిక్షణ



అటవీశాఖ అధికారులకు సూచనలిస్తున్న హైకోర్టు అడ్వకేట్

పెద్దదోర్నాల: న్యాయ స్థానాల్లో దోషులకు కఠిన శిక్ష పడాలంటే నిజ నిర్ధారణకు అవసరమయ్యే సాక్ష్యాలను సమర్పించాలని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ ఆర్.తిరుపతి అటవీశాఖ అధికారులకు సూచించారు. వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గణపతి చెక్‌పోస్టు వద్ద బుధవారం నిర్వహించిన అటవీ శాఖాధికారుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. హైదరాబాద్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో వైల్డ్‌లైఫ్ యాక్టు, అటవీ చట్టాల ఉల్లంఘన, అక్రమార్కులకు విధించే శిక్షలు, సిబ్బంది ప్రాథమిక విధులు తదితర అంశాలపై అటవీశాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. అటవీశాఖ అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల స్వేచ్ఛకు భంగం కలిగించడం, వాటి ప్రాణాలకు ముప్పు కలిగించే వారితోపాటు అక్రమంగా కలప, వెదురు తదితర వన సంపదను దోచుకెళ్లే అక్రమార్కులకు కోర్టుల్లో కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అయితే అటువంటి వారిపై కేసులు పెట్టినా నేర పరిశోధనలో మరింత లోతుగా విచారించకపోవడం, దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయకపోవడం, నేరారోపణకు సంబంధించి సరైన సాక్ష్యాలు, రుజువులను కోర్టు ఎదుట ప్రవేశపెట్టకపోవడం వల్ల కొన్ని సందర్భాల్లో కేసులు బలహీనపడుతున్నాయని గుర్తు చేశారు. అటవీశాఖ సిబ్బంది ప్రాణాలు సైతం పణంగా పెట్టి అటవీ సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. శిక్షణ కార్యక్రమంలో శ్రీశైలం టైగర్ రిజర్వ్‌ప్రాజెక్టు పరిధిలో మార్కాపురం, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, గంజివారిపల్లె, కొర్రప్రోలు, గంజివారిపల్లె, నెక్కంటి తదితర ఫారెస్టు రేంజి అధికారులు, డిప్యూటీ రేంజ్ అధికారులు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లతోపాటు వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ సొసైటీ, హైదరాబాద్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల సమాచారానికి ప్రాధాన్యం

- ఎస్పీ మలికాగర్గ్
- టాప్-5 మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలు అందుకున్న మహిళా పోలీసులతో ఎస్పీ

ఒంగోలు టౌన్: మహిళా పోలీసులు ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషించుకొని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసుల పనితీరు, వారికి కేటాయించిన కొత్త టాస్క్‌లపై బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. విధి నిర్వహణను మరింత మెరుగుపరుచుకునేలా మార్గదర్శకాలు జారీ చేశారు. సచివాలయ పరిధిలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

ఎక్కువ రోజులపాటు తాళాలు వేసిన ఇళ్ల సమాచారం తెలపాలని, ప్రైవేట్ సీసీ కెమెరాల పనితీరును గమనిస్తూ ఉండాలని చెప్పారు. ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, నంబరు ప్లేటు లేని వాహనాలు, గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా తదితర అంశాలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. జాబ్ మోసాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, దిశా యాప్, ఎల్‌హెచ్‌ఎంఎస్ సర్వీస్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసు అధికారులు మహిళా పోలీసులు ఇచ్చిన టాస్క్‌లను సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలన్నారు. వారు ఇచ్చిన సమాచారాన్ని శాస్త్రీయంగా విశ్లేషించుకొని తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. దొంగతనాలు జరగకుండా ప్రత్యేక బీట్లు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ సీసీ కెమెరాల గురించి యజమానులకు తగిన సూచనలు చేయాలన్నారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేయాలని, మిస్సింగ్ మొబైల్ ఫోన్లను వీలైనంత త్వరగా గుర్తించాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను గూగుల్ షీట్‌లో పొందుపరచాలన్నారు. త్వరలో జరగనున్న లోక్‌అదాలత్‌లో రాజీపడేందుకు అవకాశం ఉన్న కేసులను గుర్తించి, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని చెప్పారు. కాన్ఫరెన్సులో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, మార్కాపురం డీఎస్పీ కిశోర్‌కుమార్, ఐటీ కోర్ ఎస్సై కె.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టాప్ మహిళా పోలీసులకు ప్రశంసాపత్రాలు..

డిసెంబర్, జనవరి మాసాల్లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టాప్-5 గ్రామ, వార్డు మహిళా పోలీసులకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. వారిని అభినందించిన ఎస్పీ మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేయాలని సూచించారు.

డిసెంబర్‌లో టాప్–5 నిలిచిన మహిళా పోలీసులు

ఎస్.అశ్విని (గిద్దలూరు)
పి.భారతి (సింగరాయకొండ)
షేక్ సల్మా (సింగరాయకొండ)
కె.నాగలక్ష్మి (సింగరాయకొండ)
ఆర్.స్వాతి (గిద్దలూరు)

జనవరిలో టాప్–5లో నిలిచిన మహిళా పోలీసులు

జి.పుష్పలత (గిద్దలూరు)
బి.శ్రీలక్ష్మమ్మ (పొన్నలూరు)
కె.విష్ణుప్రియ (టంగుటూరు)
జి.లీలావతి (తాడివారిపల్లి)
ఎస్.అశ్విని (గిద్దలూరు)

కడితిని వేటాడిన కేసులో ఇద్దరు అరెస్టు

- మాంసాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అటవీశాఖ అధికారులు

పెద్దదోర్నాల: కొర్రప్రోలు రేంజి పరిధిలోని పెద్దమంతనాల సెక్షన్ వై.చర్లోపల్లి బీటులో కడితిని చంపి మాంసాన్ని సేకరించిన ఇద్దరు వ్యక్తులను ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసన్నజ్యోతి అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కేసు సంబంధించిన వివరాలను ఆమె బుధవారం విలేకరులకు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొర్రప్రోలు సమీపంలోని మిరపతోటలో కడితిని చంపి, మాంసాన్ని వండుకుని తింటున్నట్లు మంగళవారం సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలంలో అర్తి వెంకటేశం, బైరబోయిన ఆంజనేయలు పట్టుబడ్డారని, కడితి మాంసంతోపాటు ఇతర శరీర భాగాలను నిరుపయోగంగా ఉన్న ఓ బోరుబావిలో వేసినట్లు గుర్తించామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో డిప్యూటీ రేంజి అధికారి మౌలాళి, తానీషా, సుధాకర్, బానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు
- ఖైదీలకు న్యాయసేవా సహాయంపై అవగాహన



న్యాయ సహాయంపై ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు

ఒంగోలు: క్షణికావేశంలో నేరాలు చేయడం వల్ల కుటుంబం, సమాజానికి దూరమై నేరస్తునిగా ముద్ర పడుతుందని, సన్మార్గంలో నడుస్తూ మంచి పౌర సమాజం ఏర్పాటులో భాగస్వాములు కావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు ఖైదీలకు హితబోధ చేశారు. బుధవారం స్థానిక జిల్లా జైలులో ఖైదీలకు న్యాయసేవా సహాయంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ.. న్యాయవాదులను నియమించుకోలేనివారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11న దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ప్రకాశం జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆర్.శివకుమార్ ఆధ్వర్యంలో కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇరువర్గాలకు చెందిన కక్షిదారుల ఆమోదంతో రాజీ పడేందుకు అర్హత కలిగిన క్రిమినల్ కేసులు కూడా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జైల్లో ఉన్న ఖైదీలు తమ కుటుంబ సభ్యులకు తెలియజేసి రాజీ ప్రయత్నాలు చేసుకోవచ్చన్నారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలను పరిశీలించారు. మహిళా ఖైదీలతో మాట్లాడుతూ.. విలువైన జీవితాన్ని ఇబ్బందులపాలు చేసుకోవద్దని సూచించారు. జైలర్ నాయుడు, జైలు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో వాహనాలపై ఆంక్షలు

- శివరాత్రి ఉత్సవాల్లో ఆటోలు, ట్రాక్టర్లు, లారీలను అనుమతించేది లేదు
- యర్రగొండపాలెం సీఐ మారుతీకృష్ణ స్పష్టీకరణ
- భక్తులు, యాత్రికులు నిబంధనలు పాటించాలని సూచన



మాట్లాడుతున్న సీఐ, ఎస్సై, ఫారెస్ట్ రేంజ్ అధికారి

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల పుణ్యక్షేత్రానికి తరలివచ్చే భక్తులు పోలీస్ శాఖ విధించిన నిబంధనలు పాటించాలని యర్రగొండపాలెం సీఐ మారుతీకృష్ణ సూచించారు. శివరాత్రి ఉత్సవాల సమయంలో శ్రీశైలం ఘాట్ రోడ్డులోకి ఆటోలు, ట్రాక్టర్లు, లారీలను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ ఆంక్షలు, ముందస్తు జాగ్రత్త చర్యలపై మాట్లాడారు. దైవ దర్శనానికి వచ్చే యాత్రికులతో ప్రతి ఒక్కరూ గౌరవంగా నడుచుకోవాలని, అసౌకర్యం కలిగించవద్దని సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి వచ్చివెళ్లే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఘాట్ రోడ్డులో ప్రమాదాలను నివారించే లక్ష్యంతో ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, డీసీఎం వాహనాల్లో ప్రయాణాలపై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆటోలు, ట్రాక్టర్లు, లారీల్లో ప్రయాణాన్ని రద్దు చేసుకోవాలని సూచించారు. ఆయా వాహనాలకు మల్లికార్జుననగర్ వద్ద పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 18వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 19వ తేదీ ఉదయం 5 గంటల వరకు ఆర్టీసీ బస్సులతో సహా ఎటువంటి వాహనాలను శ్రీశైలానికి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఘాట్‌లో రెండు జీపులు, నాలుగు బైకులతో మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిని సంప్రదించి సహాయం పొందవచ్చన్నారు. సమావేశంలో ఎస్సై శ్రీనివాసరావు, ఫారెస్టు రేంజి అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన యువకుడు చింతల వెంకటనారాయణరెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ సంపత్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు... ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన గూడాల కిరణ్మయి విశాఖపట్నంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. అదే గ్రామానికి చెందిన చింతల వెంకటనారాయణరెడ్డి విజయవాడలో చదువుతున్నాడు. గత నెల 11వ తేదీన విశాఖపట్నం వెళ్లి కిరణ్మయికి మాయమాటలు చెప్పి లాడ్జికి తీసుకొని వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి బెదిరించాడు. దీంతో మనస్తాపం చెందిన కిరణ్మయి జనవరి 13న ఇంటికి వచ్చి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు ఒంగోలు వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఆత్మహత్యకు కారణాలు తెలియక తల్లిదండ్రులు మృతురాలి ఫోన్‌కాల్స్ చెక్ చేయించారు. దీంతో అసలు విషయం బయట పడింది. దీంతో తండ్రి గూడాల సుబ్బారెడ్డి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ..కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.